క్లుప్తంగా

యువకుడికి ఆర్థిక సాయం



గట్టు: మండలంలోని బల్గెరకు చెందిన యువకుడు రవివర్మకు పోటీ పరీక్షల కోచింగ్ కోసం సోషల్ రెస్పాన్సిబులిటీ సభ్యులు రూ.25 వేల ఆర్థిక సాయం అందించి ఉదారతను చాటుకున్నారు. బల్గెర గ్రామానికి చెందిన రవివర్మ డిగ్రీ పూర్తి చేసుకున్నాడు. ఎస్ఎస్‌సీ (స్టాఫ్ సెలక్షన్ కమిషన్) కోచింగ్ కోసం ఫీజు చెల్లించలేని పరిస్థితి లేక పోవడంతో సోషల్ రెస్పాన్సిబుల్టి టీంను అభ్యర్థించాడు. దీంతో టీం సభ్యులు ముందుకొచ్చి హైదరాబాద్‌కు చెందిన టీఎస్, ట్రాన్స్‌కో, చీఫ్ ఇంజనీర్ ఏ వివేకానంద చేతుల మీదుగా రవివర్మకు రూ.25 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో క్లెం శ్రీనివాసరెడ్డి, నర్సింహా, భాస్కర్, శ్రీరామ్, వెంకట్రాముడు, శ్రీనివాసులు, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన నడిపి బీసన్న, వేముల గ్రామానికి చెందిన నవీన్‌లు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం ట్రస్ట్ చైర్మన్ పోతురాజు సోమనాద్రి బుధవారం ఆయా గ్రామాలకు వెళ్లి బాధితులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు భాస్కర్, గట్టుబాబు, తిమ్మప్ప, సిరాజ్, దేవన్న, రామకృష్ణ ఉన్నారు.

ఎన్నికల ప్రచారంలో నాయకులు

సాక్షి నెట్‌వర్క్: ధరూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తిరుపతయ్య సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన 50మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేటీదొడ్డి మండలం చింతలకుంటలో రంజిత్‌కుమార్‌ను గెలిపించాలని నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉండవెల్లి మండలంలోని మారమునగాల, మానవపాడు మండలం జల్లాపురంలో బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర వాదులను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవీ రమణ గద్వాలలోని పార్టీ ఆఫీస్‌లో పేర్కొన్నారు.

కంటైనర్ డ్రైవర్‌పై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: రోడ్డు ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఇటిక్యాల ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా నాంపల్లి మండలంలోని నివిళ్ల గూడెంకు చెందిన కప్పెర కృష్ణయ్య తన బంధువులైన కొండపల్లి వెంకటేష్, దుగ్గి తిరుపతి, కల్లెం నర్సింహలతో కలిసి తన ఆటోలో పని నిమిత్తం మంగళవారం ఉదయం మానవపాడు మండలంలోని పల్లెపాడు వెళ్లారు. పని ముగిసిన అనంతరం తిరిగి మధ్యాహ్నం స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై ఎర్రవల్లి గ్రామ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ దగ్గర వెళ్తున్న ఆటోను కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ వెనక నుంచి వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో వెనకభాగం నుజ్జునుజ్జు కావడంతో అందులో ప్రయాణిస్తున్న కొండపల్లి వెంకటేష్, దుగ్గి తిరుపతి, కల్లెం నర్సింహలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని గద్వాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ కప్పెర కృష్ణయ్య ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ షాజహాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా ఎల్‌కే అద్వాని జన్మదిన వేడుకలు



అయిజ: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం మాజీ ఉప ప్రధాని ఎల్ కే అద్వాని 96వ జన్మదినం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహయ్యశెట్టి, ప్రదీప్ కుమార్, భగత్ రెడ్డి, నవీన్ కుమార్, వెంకటేష్, వీఆరయ్య ఆచారి, రాజశేఖర్, రఘు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

గద్వాల క్రైం: మద్యం తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్, గద్వాల రూరల్ ఎస్ఐ ఆనంద్‌లు తెలిపారు. బుధవారం అయిజ, ధరూర్ మండలాలకు చెందిన రాముడు, సవరన్న, గోవర్ధన్‌రెడ్డిలు మద్యం తరలిస్తున్నట్లు సమాచారం మేరకు పలు రూట్లలో సిబ్బంది తనిఖీ చేశారు. వారి వద్ద 13 లీటర్ల మద్యం పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. గద్వాల మండలం జగంపల్లికి చెందిన వెంకటస్వామి ఇంట్లో 16 లీటర్ల మద్యం నిల్వ ఉన్నట్లు సమాచారం రావడంతో సోదాలు నిర్వహించారు. మద్యం సీసాలు గుర్తించి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

మధ్యాహ్న భోజనానికి స్వస్తి

- పాఠశాలలో లేని ఏజెన్సీలు
- ప్రైమరీ పాఠశాలల్లో పట్టించుకునే వారు లేరు
- అయోమయంలో అధికారులు



చిన్న ఆముదాలపాడులోని పాఠశాలలో పోయిమీదే భోజనం చేస్తున్న మహిళ

ఉండవెల్లి: పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా గతంలో వేతనాలు లేక, బిల్లులు రాక మధ్యాహ్న భోజన వర్కర్లు నానా అవస్థలు పడ్డారు. ఇటువంటి తరుణంలో మధ్యాహ్నం భోజన వర్కర్లకు నెలకు రూ.3 వేలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాల కింద ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలైంది. ప్రభుత్వం విద్యార్థులకు సరిపడా బియ్యాన్ని ఎంపిక చేసిన ఏజెన్సీలకు ఇస్తుండగా, కురగాయలు, ఇతర నిత్యవసర సరుకులన్నీ ఏజెన్సీలే సమకూర్చుకుని పిల్లలకు వండి వడ్డిస్తున్నాయి. ప్రాథమికస్థాయిలో ప్రతి విద్యార్థికీ రోజుకు రూ.5.45, ఆరు నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థులకు రూ. 8.17, తొమ్మిది నుంచి పది తరగతుల వారికి రూ. 10.17 చొప్పున చెల్లిస్తున్నారు. బిల్లులతో పాటు వర్కర్లకు గౌరవ వేతనం కింద నెలకు రూ. 1000 చెల్లిస్తున్నారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు ఉన్నాయి.



శేరుపల్లెలో మధ్యాహ్న భోజనం లేక ఇంటిముఖం పట్టిన విద్యార్థులు

స్పష్టతపై అయోమయం..

అలంపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని ప్రాథమిక పాఠశాలలు 125, ప్రాథమికోన్నత పాఠశాలలు 52, ఉన్నత పాఠశాలలు49 ఉండగా, అన్ని పాఠశాలలు కలిపి దాదాపు 28,330 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం సద్వినియోగం చేసుకుంటున్నారు. వారికి 591 మంది ఏజెన్సీలు పని చేస్తున్నాయి. ఉత్తర్వుల్లో స్పష్టత లేకపోవటంతో అధికారులు అయోమయంలో పడ్డారు. దీంతో కొంత సందిగ్ధత నెలకొంది.

30లోపు విద్యార్థులున్న పాఠశాలలో భోజన అవస్థలు

ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి. మెనూ పాటించాలని ఉన్నతాధికారులు ఉపాధ్యాయులకు స్పష్టత ఇస్తున్నారు. ఉండవెల్లి మండలంలోని శేరుపల్లెలో 30లోపు విద్యార్థులు ఉండడంతో మధ్యాహ్న భోజనం అమలు కావడం లేదు. గిట్టుబాటు కావడం లేదని ఏజెన్సీ వారు మధ్యాహ్న భోజనం చేయడం లేదు. దీంతో విద్యార్థులు టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకుంటున్నారు. ఈ విషయం ఉపాధ్యాయులను అడిగితే ఏజెన్సీ రావడం లేదని చెబుతున్నారు. ప్రైమరీ పాఠశాలలోనే ఇలాంటి పరిస్థితి ఉంది.

నెల రోజులుగా టిఫిన్‌లు కట్టుకొచ్చాం..



ప్రతి రోజు మధ్యాహ్న భోజనం పెట్టేవారు. కానీ ఉపాధ్యాయులే టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకోమని చెబుతున్నారు. ఒక్కోసారి మా తల్లితండ్రులు ఇంటికి తాళం వేసి పనులకు పోతే ఆకలితో ఉంటున్నాం. అధికారులు పట్టించుకోని మధ్యాహ్న భోజనం బడిలోనే పెట్టాలి.

– మందీప్, విద్యార్థి శేరుపల్లె

అమలుపై స్పష్టత లేదు

మధ్యాహ్న భోజనం వర్కర్లకు వేతనాలు పెంచారు. కానీ ప్రైమరీ పాఠశాలలో ఏజెన్సీలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అన్ని పరిశీలించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటాం.

– మహ్మద్ సిరాజుద్దీన్, డీఈఓ.

టూరిస్టులకు గద్వాలలో చోటులేదు



బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్/గద్వాల అర్బన్/గట్టు : శంషాబాద్ టూరిస్టు నాయకులకు గద్వాలలో చోటులేదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అ భ్యర్థి సరితను ఉద్దేశించి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమో హన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన తన నివాసంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే అవి నీతి, అక్రమాలకు మారుపేరన్నారు. వారి హయాంలో వలసలు, అంధకారం, రైతు ఆత్మహత్యలు ని త్యకృత్యంగా ఉండేవన్నారు. ఆనాడు తెలంగాణను నిండాముంచిన పార్టీ కాంగ్రెస్ అని, ఇప్పుడు పదేళ్లుగా సీఎం కేసీఆర్ పరిపాలనలో పచ్చబడ్డ తెలంగాణను చూసి ఓర్వలేక మళ్లీ నాశనం చేయాలని కుట్రలు చేస్తున్నట్లు మండిపడ్డారు. కేవలం పదవీ వ్యామోహంతోనే పార్టీ మారిన వారి మాటలు న మ్మితే గద్వాల ప్రజలు మోసపోవడం ఖాయన్నా రు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ పార్టీ నిరంతరాయంగా ఉచిత విద్యుత్, దళితబంధు, రైతుబంధు, రైతుబీమా, గొర్రెల పంపిణీ, మైనార్టీ బంధు, బీసీ బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజల సంక్షేమం కోసం పాటుపడిందన్నారు. అనంతరం ఆయన గద్వాల నియోజకవర్గంలోని పలు మండలాలు, పట్టణంలోని పలువార్డులకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పిఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పటేల్‌ప్రభాకర్‌రెడ్డి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వేణుగోపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

కాంగ్రెస్‌ను బొందపెట్టడమే లక్ష్యం

కాంగ్రెస్ పార్టీని బొందపెట్టడమే బీఆర్ఎస్ లక్ష్యమని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. గద్వాల మండలంలోని కాకులావరం, పరుమాల, రేపల్లి, కొండపల్లి, పూడురు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, సంజీవులు, అశోక్‌రెడ్డి, రమేష్ నాయుడు, సత్యనారాయణ, నాగరాజు, బీచుపల్లి ఉన్నారు.

ప్రతి కుటుంబానికి భరోసా

తెలంగాణ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందని, మరో మారు అవకాశం కల్పించాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడు, ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల, ఎమ్మెల్యే కుమారుడు సాయిసాకేత్‌రెడ్డిలు బల్గెర ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



వాహనం తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

అలంపూర్: ఎన్నికల సందర్భంగా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఎన్నికల నియమావళిలో భాగంగా డబ్బు, మద్యం రవాణాపై అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఉండవెల్లి మండలం డీ బూడిదపాడు వద్ద అలంపూర్–అలంపూర్ చౌరస్తా రోడ్డుపై ఫ్లెయింగ్ స్క్వాడ్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. అలంపూర్ నుంచి అలంపూర్ చౌరస్తా మీదుగా వచ్చిన వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులతో ఓటర్లను ప్రలోభ పెట్టడానికి తరలించే వాహనాపై నిఘా పెట్టినట్లు తెలిపారు. పోలింగ్ ముగిసే వరకు నిరంతరం తనిఖీలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అంతర్రాష్ట్రాల సరిహద్దుల్లో సైతం వాహన తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం రాష్ట్రంలోకి ప్రవేశించడానికి అనుమతిస్తున్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం.. ఎదగనిద్దాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్యంలో భాగంగా అవగాహన కల్పించారు. బుధవారం పుల్లూరు గురుకుల పాఠశాలలోని బాలల సంరక్షణ శాఖ అధికారి నరసింహులు విద్యార్థులకు ప్రత్యేక అవగాహనలో భాగంగా బాల్య వివాహాలను నిర్మూలించాలని, నిరక్ష్యరాస్యత లేకుండా ఎదగాలని సూచించారు. బాలలపై ఎలాంటి ఫిర్యాదు చేయాలనుకుంటున్న 1098కు కాల్ చేయొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవానందం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆస్మా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూత్ లెవల్ కమిటీలకు అవగాహన

అయిజ: మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ బూత్ లెవల్ కమిటీకి ఎన్నికల నిర్వాహనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ బీఎల్ఓలకు, వార్డు ఆఫీసర్‌లకు, ఆర్‌పీలకు ఎన్నికల సమయంలో చేపట్టాల్సిన బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజేష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మన్న, బీఎల్‌ఓలు, వార్డు ఆఫీసర్లు, ఆర్‌పీలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్

బాలల సంరక్షణపై విద్యార్థులకు,,

అయిజ: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ వారు బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ నరేష్‌కుమార్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం చట్టరిత్యా నేరమన్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు 100 లేదా 1098కి ఫోన్ చేయాలన్నారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ విభాగం సభ్యుడు బాలల హక్కుల గురించి వివరించారు. బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012 గురించి వివరించారు. కార్యక్రమంలో బాలల పరిర క్షణ విభాగం సభ్యుడు ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో అపార నష్టం

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులకు అపార నష్టం వాటిల్లింది. చేతికందిన పంటలు తడిసి ముద్దయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బోరు బావుల కింద సాగుచేసిన మిరప, మొక్కజొన్న, ఉల్లి పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. కల్లాల్లో ఆరబోసిన మిరప పంటతో పాటు రేపో మాపో కోద్దామని పొలాల్లో ఉన్న మొక్కజొన్న కంకులు తడిచి ముద్దయ్యాయి. మెట్ట పంటగా సాగుచేసిన కంది, పొగాకు పంటలకు వర్షంతో ఊరట లభించిందని మెట్ట పంట సాగుచేసిన రైతులు పేర్కొన్నారు. దసరా ముందు వర్షం కురిసి ఉంటే అన్ని పంటలకు అనుకూలంగా ఉండేదని, ఇప్పుడు వర్షంకురవడం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉందని రైతులు పేర్కొన్నారు.

11న మహాసభకు తరలిరావాలి



విశ్వరూప మహాసభ పోస్టర్‌ను విడుదల చేసిన నాయకులు

కేటీదొడ్డి: మాదిగల విశ్వరూప సభలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు జంబయ్య అన్నారు. మండల పరిధిలోని నందిన్నె, చింతలకుంట, సోంపురం, ఎర్సందొడ్డి గ్రామంలోని 11న హైదరాబాద్‌లో జరిగే మాదిగల ఉపకులాల విశ్వరూప మహాసభలకు తరలిరావాలని బుధవారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తు భారీ సభను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఏసయ్య, ఆంజనేయులు, ప్రకాష్, రాము, దేవదాసు, ఉస్సేన్ ఉన్నారు.

గొర్రెలకు నట్టల నివారణ మందుల పంపిణీ

మల్దకల్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను తప్పని సరిగా వేయించాలని పశువైద్యాధికారి విజయ్‌కుమార్ కోరారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పశువైద్యులు వేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు ఏడాదికి మూడు పర్యాయాలు నట్టల నివారణ మందులను తాపించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, రాఘవేందర్, రాజేంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకోవాలి

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు నెలనెల తప్పనిసరిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ స్వరూపారాణి సూచించారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులు, బాలింతలకు ఆమె వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు నెలనెలా వైద్యపరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవడం సురక్షితమన్నారు. పోషకాలు ఎక్కువగా ఉండే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

రెండురోజుల్లో కార్యాచరణ



శాంతినగర్: రెండు రోజుల్లో కార్యాచరణ చేసుకుందామని వడ్డేపల్లి, రాజోళి మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా తీర్మానించారు. వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామంలో మాజీ ఆర్డీఎస్ చైర్మన్ సీతారామిరెడ్డి అధ్యక్షతన ఉమ్మడి వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈసందర్భంగా వారందరు భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించారు. ఎమ్మెల్యే అబ్రహం రాజకీయాల నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించారని, దీంతో అందరం బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుదామా లేదా వేరే పార్టీలో చేరుదామా అనే విషయమై చర్చించుకున్నారు. రెండు రోజుల్లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచి చూసి అనంతరం నిర్ణయం తీసుకుందామని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైనార్టీలకు ఎన్ని టికెట్లు ఇచ్చారో చెప్పాలి

గద్వాల అర్బన్: వైఎస్ఆర్‌టీపీలో నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా పని చేస్తున్న అతిఖుర్ రహ్మాన్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి బహుజన సమాజ్ పార్టీలో చేరారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ గద్వాల నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగా అతిఖుర్ రహ్మాన్‌ను ప్రకటించి, పార్టీ బీ ఫాం అందజేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు తెలిపారు. ఈ సమావేశంలో బిఎస్పీ నాయకులు బండారి రాజు, ప్రకాష్, గోపాల్ రెడ్డి, ముని, సవారన్న, డానియేల్, తిమ్మప్ప ఉన్నారు.

వంద రోజుల్లో నిధులు తీసుకొస్తా..

అలంపూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో తుమ్మిళ్ల ఎత్తిపోతల రిజర్వాయర్లు, నెట్టంపాడు అసంపూర్తి పనులకు నిధులు తెస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సంపత్ కుమార్ అన్నారు. అలంపూర్‌లో బుధవారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అన్ని వర్గాల ప్రతినిధులతో కలిసి నామినేషన్ వేశానని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉన్న నాకు అన్నీ ప్రధాన వర్గాల మద్దతు ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల్లో అందరు అండగా నిలుస్తున్నారన్నారు. ఇప్పటి వరకు అన్నీ గ్రామాల్లో ఒక దశ ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. తొమ్మిదిన్నర సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల అసంతృప్తితో ఉన్నారన్నారు. కాంగ్రెస్ గతంలో అందించిన సంక్షేమ పథకాలను గుర్తించి ప్రజల నుంచి మంచి స్పంద వస్తోందన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎవరికి ఆషామాషిగా ఓటు వేయరన్నారు. ఆచి తూచీ ఈ ప్రాంత ప్రజలు నిర్ణయం తీసుకొని ఓటు వేస్తారన్నారు.

ఓటు విలువను తెలియజేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోవిందరావు

అలంపూర్ రూరల్: గ్రామాలలోని ప్రజలకు తమ ఓటు హక్కు విలువను తెలియజేయాలని ఎంపీడీఓ గోవిందరావు అన్నారు, పట్టణంలోనిఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో బూత్ లెవల్ అవగాహన బృందాలను ఏర్పాటు చేసి ఇందులో బీఎల్ఓ, గ్రామ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ మహిళా సంఘం స భ్యులు ఉపాధ్యాయులు, యువత, తల్లుల కమిటీ, ఆశా కార్యకర్తలు, శానిటేషన్ కమిటీల వారికి ఓటు హక్కు విలువను తెలియజేయాలన్నారు. వృద్ధులు వికలాంగులు, గర్భిణులకు పోలింగ్ కేంద్రాలలో మూడు చక్రాల కుర్చిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ముగ్గుల పోటీలు, ర్యాలీలు, ఇతర కార్యక్రమాల ద్వారా ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యతను వివరించి ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎవరైన డబ్బు , మద్యం బహుమతులు ఇస్తామని తెలిపినా, స్వీకరించినా వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్ కోసం, ఏదైనా ఫిర్యాదు కోసం 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు.

కట్నం కోసం వేధించిన భర్తకు ఏడాది జైలు శిక్ష

గద్వాల క్రైం: అదనపు కట్నం కోసం వేధించిన భర్తకు జైలు శిక్ష విధిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌నాయక్ తీర్పును బుధవారం వెల్లడించినట్లు ఆ కోర్టు అదనపు పీపీ రెచల్ సంజన జాషువ తెలిపారు. గంజిపేటకు చెందిన జ్యోతిని కర్నూల్‌కు చెందిన రాజ్‌కుమార్‌కు ఇచ్చి 2014లో వివాహం చేశారు. పెళ్లైన కొన్ని నెలలకే భర్త అదనపు కట్నం కోసం వేధించాడు. ఈ క్రమంలో కొంత డబ్బు భార్య కుటుంబ సభ్యులు ఇచ్చారు. డబ్బు ఇచ్చినప్పటికీ ఇంకా కావాలంటూ ఇంట్లో కుటుంబ సభ్యులు సైతం తీవ్ర క్షోభకు గురి చేస్తూ, మానసికంగా వేధించారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన 2015 లో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా, బాధిత కుటుంబ సభ్యులు, సాక్షులను విచారించడంతో నేరం రు జువు కావడంతో నిందితుడికి సంవత్సరం మూడు రోజుల పాటు జైలు శిక్షతో పాటు రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారని అదనపు పీపీ తెలిపారు. కేసు విచారణలో పోలీసు సిబ్బందిని జడ్జి అభినందించరన్నారు.

ఉక్కపోతతో విద్యార్థినుల ఇబ్బందులు

అమరచింత: ఎన్నికల నిర్వహణలో భాగంగా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసిన అధికారులు తరగతి గదుల కిటికీలను మూసి ఉంచడంతో విద్యార్థినులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలలో మూడు తరగతి గదుల కిటికీలను పూర్తిగా మూసేశారు. దీంతో తరగతి గదిలోకి గాలి, వెలుతురు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com